ప్రజాశక్తి

మంగళవారం 22 అక్టోబర్ 2024 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

పులిచింతలకు పెరిగిన వరద

నాలుగు గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల

ప్రజాశక్తి - జగ్గయ్యపేట, విజయవాడ : పులిచింత ప్రాజెక్టుకు సోమవారం వరద ప్రవాహం పెరిగింది. దీంతో మధ్యాహ్నం రెండు గంటలకు నాలుగు రేడియల్ గేట్లు ఎత్తి 1,03,162 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న ప్రకాశం బ్యారేజికి విడుదల చేశారు. విద్యుదుత్పత్తికి 16 వేల క్యూసెక్కులు కలిపి 1,19162 క్యూసెక్కుల నీటిని ప్రకాశం బ్యారేజికి విడుదల చేస్తున్నట్లు ఎఇఇ రాజు తెలిపారు. ఎగువ ఉన్న నాగార్జునసాగర్ పరీవాహక ప్రాంతం నుంచి 1,34,933 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం పులిచింతల ప్రాజెక్టులో 40.67 టిఎంసిల నీరు నిల్వ ఉంది.

బ్యారేజి వద్ద ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 2,28,532 క్యూసెక్కులు

అలాగే ఎగువ నుండి ప్రకాశం బ్యారేజికి సోమవారం రాత్రి 8 గంటల సమయానికి 2,28,532 క్యూసెక్కుల వరద నీరు వచ్చింది. దీంతో బ్యారేజికి చెందిన మొత్తం 70 గేట్లను ఐదు అడుగుల మేరు ఎత్తి 2,20,500 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. 5,513 క్యూసెక్కుల నీటిని కృష్ణా డెల్టా తూర్పు ప్రధాన కాల్వకు, 2,519 క్యూసెక్కుల నీటిని కృష్ణా డెల్టా పశ్చిమ ప్రధాన కాల్వకు, 8,032 క్యూసెక్కుల నీటిని కాల్వలకు విడుదల చేశారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతోంది.

నేడు పున్నమి ఘాట్లో మెగా డ్రోన్ షో

ప్రజాశకి - వన్‌టౌన్ : విజయవాడ పున్నమిఘాట్ కృష్ణా నది ఒడ్డున మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యాన డ్రోన్ షో జరుగుతుంది. ఐదు వేలకు పైగా డ్రోన్లతో జరిగే మెగా షోకు ఎన్టీఆర్ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ నిధి మీనా, వివిధ శాఖల అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. నగరంలో బెంజిసర్కిల్, రామవరప్పాడు, వారధి, బస్టాండ్, ప్రకాశం బ్యారేజీల వద్ద భారీ డిజిటల్ తెరలను ఏర్పాటు చేశారు. ఈనెల 22న ఉదయం సీకే కన్వెన్షన్ సెంటర్లో అమరావతి డ్రోన్ సమ్మిట్ 2024ను ప్రారంభించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు డ్రోన్ కార్పొరేషన్ ఎండీ కె. దినేష్ కుమార్ తెలిపారు. ఈసమ్మిట్‌కు ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరవుతారు.





మచిలీపట్నంలో పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర; విజయవాడలో నివాళులర్పిస్తున్న సిఎం చంద్రబాబు, మంత్రి అనిత, డిజిపి తిరుమలరావు


పోలీసు అమరవీరులకు ఘన నివాళి

ప్రజాశక్తి - విజయవాడ, కలెక్టరేట్ (కృష్ణా) : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా సోమవారం విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మచిలీపట్నం పోలీస్ పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో అమరవీరుల స్తూపం వద్ద మంత్రి కొల్లు రవీంద్ర పోలీస్ అమరవీరులకు ఘన నివాళులర్పించారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత దేశ భద్రత కోసం ప్రాణాలను అర్పించిన పోలీసుల త్యాగాలను స్మరించుకున్నారు. రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమల రావు పోలీసుల త్యాగ నిరతి గురించి వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సిఎం చంద్రబాబు, మంత్రి అనిత, డిజిపి తిరుమలరావు పరిశీలించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, ఐజీ ఇంటెలిజెన్స్ సీహెచ్. శ్రీకాంత్, పోలీసు ఉన్నతాధికారులు, పోలీసు సిబ్బంది, పోలీసు అమరవీరుల కుటుంబాల వారు పాల్గొన్నారు. మచిలీపట్నంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివన్నారు. పోలీస్ వ్యవస్థ లేకపోతే నేటి సమాజంలో పరిస్థితిని ఊహించలేమన్నారు. పోలీసు విధి అంటేనే కత్తిమీద సాములాంటిదని, అరాచక శక్తులపై వారు చేసే పోరాటం తలచుకుంటేనే ఒళ్ళు గగుర్పొడుస్తుందని అన్నారు. విధి నిర్వహణలో అనేక కష్టనష్టాలకోర్చి 24 గంటలు ప్రజల రక్షణ కోసం శ్రమిస్తున్న పోలీసు సిబ్బందికి అభినందనలు తెలిపారు. విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరులకు ఘన నివాళులర్పించారు. పోలీసు శాఖను బలోపేతం చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. మంచి పోలీసింగ్ జరగాలని, ప్రజలు సంతోషంగా ఉండాలని ముఖ్యమంత్రి కోరుకుంటున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో కొంతమంది రాష్ట్ర పరువు దిగజార్చారని, పోలీసులు ధైర్యంగా తలెత్తుకొని నిలబడేలా చేయడం ప్రభుత్వ కర్తవ్యమని అన్నారు. ఈసందర్భంగా రూ.50 వేల నగదును కష్ణాజిల్లా పోలీస్ సంక్షేమ నిధికి విరాళంగా అందించారు. ఎస్‌పి ఆర్.గంగాధర్ రావు మాట్లాడుతూ ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణ కోసం అహర్నిశలు కష్టపడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన మహనీయులు పోలీసులలని కొనియాడారు. దేశవ్యాప్తంగా 2023-24లో 216 మంది పోలీసులు అమరవీరులయ్యారని, కష్ణాజిల్లా వ్యాప్తంగా పదిమంది అమరులయ్యారని తెలిపారు. తొలుత మంత్రి, జిల్లా ఎస్పీ పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ జిల్లా పోలీస్ గ్రౌండ్స్ నుంచి లక్ష్మీ టాకీస్ వరకు పోలీసులు నిర్వహించిన ర్యాలీని మంత్రి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం లక్ష్మీ టాకీస్ వద్ద మానవహారం నిర్వహించారు. మచిలీపట్నం మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, స్థానిక ప్రముఖ నాయకులు బండి రామకష్ణ పోలీస్ అమరవీరులకు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీగా పదోన్నతి పొందిన ఎస్‌విడి ప్రసాద్, డిఆర్‌ఓ కె.చంద్రశేఖర రావు, ఆర్డీవో కె.స్వాతి పాల్గొన్నారు.

ఇసుక కోసం ఘర్షణ

ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి - మైలవరం : ఇంటి అవసరాల నిమిత్తం ఇసుక కోసం వెళ్లిన వారిపై ఇసుక మాఫియా దాడి చేయడంతో ఐదుగురు గాయపడ్డారు. వీరిలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈసంఘటన ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం వెల్లటూరు పంచాయతీ సీతారాంపురంలో సోమవారం జరిగింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎడ్ల బండి, ట్రాక్టర్ ఉంటే చాలు ఇసుక (మిగతా 2లో)



ఘర్షణ పడుతున్న రామారావు, గోపాల్ రావు వర్గీయులు; దాడిలో గాయపడిన రామారావు

వైసిపికి షాక్

ముగ్గురు కార్పొరేటర్లు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ నగర పాలక సంస్థలో వైసిపికి షాక్ తగిలింది. వైసిపికి చెందిన ముగ్గురు కార్పొరేటర్లు సోమవారం టిడిపిలో చేరారు. విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), సెంట్రల్ ఎంఎల్‌ఎ బొండా ఉమామహేశ్వరరావు సమక్షంలో వారు టిడిపిలో చేరారు. కార్పొరేటర్లు లక్ష్మీపతి, రమాదేవి, తిరుపతమ్మకు ఎంపి, ఎంఎల్‌ఎ టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వార్త మెయిన్‌లో



మీడియాతో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ప్రజల దృష్టి మరల్చేందుకే జమిలి రాగం

వి.శ్రీనివాసరావు

కృష్ణా వరద బాధితులను ఆదుకోండి

- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్
- సెంట్రల్ తహాశీల్దార్ కార్యాలయం వద్ద బాధితుల ధర్నా

ప్రజాశక్తి - విజయవాడ: నగరంలో కృష్ణానది వరదల వల్ల నష్టపోయిన వేలాది కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ డిమాండ్ చేశారు. నగరంలోని 17, 18, 20, 21 డివిజన్లలోని రాణిగారితోట, కృష్ణలంక పరిధిలోని తారకరామానగర్, భూపేష్‌గుప్తా నగర్, గీతానగర్, రణదివేనగర్ ప్రాంతాల వరద బాధితులకు ఇప్పటికీ పరిహారం అందలేదన్నారు. కృష్ణా నది వరద బాధితులందరికీ నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సెంట్రల్ తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో బాధితులు ధర్నా నిర్వహించారు. బాధితులతో సామూహిక రాయబారం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ వరదల వల్ల బాధితులు కట్టు బట్టలతో (మిగతా 2లో)




సెంట్రల్ తహాశీల్దారు కార్యాలయం వద్ద బాధితుల ధర్నాలో దోనేపూడి కాశీనాథ్, పి.కృష్ణ తదితరులు

కౌలు రుణాలపై నిర్లక్ష్యం

- మంజూరైన గుర్తింపుకార్డులు 66,334
- రుణాల లబ్ధిదారులు 5,735 మంది
- మంజూరైన రుణాలు రూ.23.22 కోట్లు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

2024-25 ఖరీఫ్ సీజన్లో కృష్ణాజిల్లాలో నిర్ణయించుకున్న రూ.3,734 కోట్ల మేర పంట రుణాల లక్ష్యాన్ని మించి రూ.3,734.25 కోట్ల రుణాలను అందించామని బ్యాంకర్లు, జిల్లా అధికారులు చెబుతున్న మాట. కానీ సాగు హక్కు ధృవీకరణ పత్రాలు (క్రాఫ్ కల్టివేషన్ రైట్ కార్డు - సిసిఆర్‌సి) ఉన్నా తమకు బ్యాంకులు పంట రుణాలు ఇవ్వలేదని అత్యధిక మంది కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణాజిల్లాలో 2 లక్షల మందికిపైగా కౌలు రైతులుంటే ఇప్పటికి 66,334 మందికి మాత్రమే కార్డులు మంజూరయ్యాయి. వీరిలో కేవలం 5,785 మందికి రూ.23.22 కోట్లు మాత్రమే పంట రుణాలుగా అందాయి. ఈ గణాంకాలను పరిశీలించినప్పుడు కౌలు రైతులను ప్రభుత్వాలు, బ్యాంకర్లు ఎంతగా నిర్లక్ష్యం చేస్తున్నాయో తేటతెల్లం అవుతోంది. భూ యజమానులకే



బ్యాంకులు రుణాలు మంజూరు చేయడంతో పెట్టుబడికి ప్రైవేటు వ్యాపారుల వద్ద తీసుకున్న అప్పుకు అధిక వడ్డీలు చెల్లించి కౌలు రైతులు నష్టపోవాల్సి వస్తోంది. కంకిపాడు మండలం గొడవర్రుకు చెందిన అయ్యంకి (మిగతా 2లో)

24న ఎంబివికెలో 'జ్యోత్స్న జ్ఞాపకాలతో...'

ప్రజాశక్తి - విజయవాడ : ఈనెల 8న రాజస్థాన్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన అమరావతి బాలోత్సవ్ కమిటీ కార్యదర్శి, తరుణీతరంగాలు ప్రధాన కార్యదర్శి, సేఫ్ (స్టెప్ ఎహెడ్ ఫర్ ఈక్వాలిటీ) వ్యవస్థాపకురాలు గుళ్లపల్లి జ్యోత్స్న జ్ఞాపకాలను పంచుకునేందుకు ఈనెల 24వ తేదీ ఉదయం 10.30 గంటలకు 'జ్యోత్స్న జ్ఞాపకాలతో...' కార్యక్రమం నిర్వహించనున్నారు. విజయవాడ గవర్నరుపేటలోని బాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె)లో ఈ కార్యక్రమం జరుగుతుంది. ఎంబివికె, అమరావతి బాలోత్సవం, సేఫ్, ఐద్వా, ఎన్ఎఫ్ఐడబ్ల్యు, పిఒడబ్ల్యు, తరుణితరంగాలు, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జన శిక్షణా సంస్థాన్, స్ఫూహాప్తి ఆర్గనైజేషన్, భారత మహిళా మండలి, నిర్భయ కాంత్రి మహిళా మండలి ఆధ్వర్యాన ఈ కార్యక్రమం జరుగుతుంది.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - విజయవాడ : మంగళవారం ఉదయం 7 నుండి 10 గంటల వరకు గవర్నరుపేట సెక్షన్, గవర్నరుపేట విద్యుత్ ఉపకేంద్రం 11 కేవీ విజయ టాకీస్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మత్తులు, మెయింటినెన్స్ నిమిత్తం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎపిసిపిడిసిఎల్ విజయవాడ టౌన్ కార్యనిర్వాహక ఇంజినీరు పి.రవీంద్రబాబు తెలిపారు. మూర్తి వీధి, కూర్మయ్య వీధి, నసురుల్లా ఖాన్ వీధి, హుస్సేన్ సాహెబ్ వీధి, మౌలానా వీధి, చెరుకుపల్లి వారి వీధి, కాలేశ్వరరావు రోడ్డు, వెంకటేశ్వరరావు వీధి, రామ మందిరం వీధి, మల్లాది వారి వీధి తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

రాజధానిలో ఘంటసాల విగ్రహం ఏర్పాటుకు కృషి

●ఎంఎల్ఎ బొండా ఉమా

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలో రెండు రోజులపాటు జరిగిన ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక 13వ రాష్ట్ర మహాసభ సోమవారం ముగిసింది. కార్యదర్శి నివేదికను ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి ప్రవేశపెట్టారు. సోమవారం గాంధీనగర్ కౌతాపూర్ణానదం కళావేదికపై జరిగిన సమావేశానికి ముఖ్యఅతిదిగా సెంట్రల్ నియోజకవర్గ శాసన సభ్యులు బొండా ఉమామహేశ్వరావు హాజరై మాట్లాడుతూ అమర గాయకుడు ఘంటసాల 25 అడుగుల విగ్రహాన్ని రాజధాని ప్రాంతంలో ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. సంస్థ అధ్యక్షులు కోట వెంకటేశ్వర రెడ్డి తమ ఆశయాలను వివరించారు.



ఎంఎల్ఎ బొండా ఉమాకు వినతిపత్రం అందిస్తున్న కోట వెంకటేశ్వరరెడ్డి తదితరులు

తెలుగు కళావాహిని అధ్యక్షులు చింతకాయల చిట్టిబాబు కార్యక్రమాన్ని నిర్వహించారు. సభలో టిడిపి సీనియర్ నాయకులు నవనీతం సాంబశివరావు, కె డేవిడ్ రాజు, శ్రీ కళాభారతి అధ్యక్షులు శింగంశెట్టి చంద్రశేఖర్, ఎక్స్ రే బోడి ఆంజనేయ రాజు, కారుమంచి రాజు, జి.వి.రంగారెడ్డి, కెవి ప్రసాద్, ముష్టి శ్రీనివాస్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జరిగిన సంగీత విభావరి ఆహుతులను అలరించింది.

ప్రజా ఫిర్యాదులను త్వరగా పరిష్కరించండి

విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి - విజయవాడ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను శాఖాధిపతులే స్వయంగా పరిష్కరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. విఎంసి ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను కమిషనర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడు ఫిర్యాదులను కమిషనర్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జివిజిఎస్ వి ప్రసాద్, చీఫ్ ఇంజనీర్ శ్రీనాథ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి సృజన, ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఎస్ ఈ (వర్క్స్) పి సత్యనారాయణ, ఎస్ ఈ (ప్రాజెక్ట్స్) సత్యకుమారి, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మల్యాద్రి, ఎస్టేట్ ఆఫీసర్



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

టి శ్రీనివాస్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.అనంతరం కమిషనర్... పున్నమిఘాట్ వద్ద బబూరి (గ్రౌండ్స్) లో జరగబోవు డ్రోన్ షో ఏర్పాట్లను పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ లో మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ వారు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు.

మొదటిపేజీ తరువాయి

కౌలు రుణాలపై నిర్లక్ష్యం

విలియం నాలుగెకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. యజమాని ఆమోదంతో గుర్తింపుకార్డు మంజూరైంది. పంట పెట్టుబడి రుణం కోసం కంకిపాడులో తనకు బ్యాంకు ఖాతాలు ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ), సప్తగిరి బ్యాంకుల్లో అధికారులను సంప్రదించారు. అయితే ఆయా బ్యాంకర్లు భూ యజమాని ష్యూరిటీ ఇస్తేనే పంట రుణం మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ఇదే గ్రామానికి చెందిన యండ్రపల్లి జోజికి మూడున్నర ఎకరాలకు సిసిఆర్‌సి కార్డు ఉంది. దీంతో కంకిపాడులోని సప్తగిరి, యూనియన్ బ్యాంకు అధికారులను పంట రుణానికి సంప్రదించాడు. కానీ ఆయా బ్యాంకు అధికారులు రుణం మంజూరు చేయలేదు. ఇలా ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో అత్యధిక మంది కౌలు రైతులు రుణాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకుల నుండి రుణాలు తీసుకున్న 5,785 మంది కౌలు రైతుల్లో అత్యధికులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకు రుణాలు మంజూరుకాలేదు. అరకొరగానే వారికి రుణాలు మంజూరయ్యాయి.

కౌలు రైతుపై వడ్డీ భారం

నూటికి 0.75 పైసలకు బ్యాంకులు భూమి విస్తీర్ణాన్ని ప్రమాణాకంగా తీసుకుని రూ.3 లక్షల వరకు పంట రుణాలు మంజూరు చేస్తున్నాయి. లక్ష రూపాయలలోపు రుణం తీసుకుని సకాలంలో (12 నెలలలోపు) తిరిగి చెల్లించిన వారికి వడ్డీ మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తిరిగి వారి ఖాతాల్లో జమ చేస్తున్నాయి. రూ.3 లక్షల వరకు రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన వారికి కేంద్రం 0.33 పైసలు తిరిగి జమ చేస్తోంది. అంటే 0.42 పైసల వడ్డీకే పంట రుణం అందుతోంది. వెయ్యి రూపాయల పంట రుణానికి నెలకు కేవలం రూ.4.20 వడ్డీని బ్యాంకుకు చెల్లించాలి. ఈస్వల్ప వడ్డీ సొంత భూమిపై వ్యవసాయం చేసే రైతులకు ఒకింత ఊరట ఇస్తోంది. కానీ కౌలు రైతులకు కనీస ఊరట కూడా దొరకడం లేదు. ఒక ఎకరం వరి సాగు చేయడానికి సగటున రూ.35 వేలు వ్యయం చేయాలి. అలాగే కౌలుగా ఎకరాకు 18 నుంచి 22 బస్తాలు (బస్తా 75 కిలోలు) చెల్లించాలి. వాతావరణం సానుకూలంగా ఉండి ఎకరాకు 30 నుంచి 32 బస్తాలు పండితే 12 బస్తాలు కౌలు రైతులకు మిగులుతున్నాయి. 75 కిలోల ధాన్యం బస్తాకు రూ.1725 చొప్పున ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర అందితే భూ యజమానికి చెల్లించగా రూ.20,700 చేతికి వస్తోంది. పెట్టిన పెట్టుబడికన్నా 14,300 తక్కువగానే ఆదాయం వస్తుంది. రెండో పంట అపరాలు ఐదు బస్తాలకుపైగా పండితేనే పెట్టిన పెట్టుబడితోపాటు అంతో ఇంతో రెక్కల కష్టం కౌలు రైతుకు మిగులుతుంది. ఈమిగిలే అరకొర మొత్తం ప్రయివేటు వడ్డీ వ్యాపారులకు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంటోంది. పెట్టుబడి మొత్తాన్ని ప్రయివేటు వ్యాపారుల నుంచి అప్పుగా సమకూర్చుకున్న కౌలు రైతు నూటికి నెలకు రూ.3 వడ్డీ చొప్పున చెల్లించాలి. నెలకు రూ.1,050 చొప్పున పంట చేతికొచ్చే ఆరు నెలల సమయానికి అసలు రూ.35 వేలకు వడ్డీ మరో రూ.6,300 కలిపి రూ.41,300 వ్యాపారికి చెల్లించాల్సి వస్తోంది. పంట సమయం ఆలస్యమైతే వడ్డీ భారం మరింత పెరుగుతుంది. ఈనేపథ్యంలో రబీ సీజన్లోనైనా వాస్తవ సాగుదారులైన తమకు బ్యాంకు రుణాలు మంజూరయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కౌలు రైతులు కోరుతున్నారు.

ఇసుక కోసం ఘర్షణ

ఉచితం అంటూ ప్రకటన చేసింది. దీంతో కొంతమంది గహ అవసరాల కోసం ఇసుక కోసం వెళు తున్నారు. ఇది గిట్టని కొంతమంది ఇసుక మాఫియా తెగబడి దాడులు చేస్తున్నారు. వెల్లటూరు సీతారాంపూరం గ్రామానికి చెందిన ఆకుల రామారావు తన సొంత ఇంటి ప్రహరీ గోడ నిర్మాణం కోసం ఇసుక తెచ్చుకునేందుకు కూలీలను తీసుకొని టాక్టర్‌తో బుడమేరు వాగులోకి బయలుదేరాడు. అయితే అదే గ్రామానికి చెందిన మొండితోక గోపాలరావు, లింగాల మరియదాసు, శేషు, శరత్ బాబు, టాక్టర్‌కు అడ్డుపడి ఇసుక తోలటానికి వీల్లేదంటూ వాగ్వాదానికి దిగారు. రహదారిని తామే ఏర్పాటు చేశామని, తోలుకుంటే తామే తోలుకోవాలని, మరెవరూ ఇసుక తోలుకోవడానికి వీల్లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రామారావు తన ఇంటి అవసరానికి తోలుకుంటున్నామని, రాత్రి వేళల్లో ఇసుకను టిప్పర్లలో అమ్ముకుంటున్నది మీరేగా అని ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో గోపాల్‌రావు, మరికొందరు ఆయనపై ఇటుక రాళ్లు, కర్రలతో దాడి చేశారు .ఈ దాడిలో రామారావు తలకు తీవ్ర గాయమైన రక్తస్రావం అయ్యింది. ఆకుల వరలక్ష్మి, గార్లపాటి వెంకటరమణ, గుర్రాల సరస్వతి, మరికొందరు మహిళలపై గోపాల్‌రావు, మరికొందరు కాళ్లతో తన్ని రాళ్లతో దాడి చేయటంతో గాయపడ్డారు. క్షతగాత్రులను మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రామారావును మెరుగైన చికిత్స నిమితతం విజయవాడ తరలించారు. ఈ ఘటనలో గాయపడిన ఆకుల రామారావు, దాడి చేసిన మొండితోక గోపాల్ రావు జి.కొండూరు పోలీసుస్టేషన్లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణా వరద బాధితులను ఆదుకోండి

మిగిలారన్నారు. పునరావాస కేంద్రాల్లో తలదాచుకోవాల్సి వచ్చిందన్నారు. వరదల్లో నష్టపోయిన ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటామని, ఆఖరి కుటుంబానికి నష్టపరిహారం అందిచేంత వరకు కృషి చేస్తామని సిఎం చంద్రబాబు చెప్పారని, కానీ ఈ ప్రాంతాల్లో సగానికి పైగా బాధితులకు పరిహారం అందలేదని చెప్పారు. ఇప్పటికే అనేక పర్యాయాలు అధికారులకు, సచివాలయాల్లో అర్జీలు ఇచ్చినా, కార్యాలయాల చుట్టూ బాధితులు ప్రదక్షిణలు చేస్తున్నా పరిహారం అందకపోవడం బాధారన్నారు. ప్రభుత్వం నిర్వహించిన ఎన్యూమరేషన్‌లో అనేక లోపాలు ఉన్నాయన్నారు. తోపుడు బండ్లు, కిరాణా షాపులు, చిరు వ్యాపారులకు, వాహనాలకు నష్టపరిహారం అందలేదన్నారు. ప్రభుత్వ ప్రచార ఆర్భాట కార్యక్రమాలే తప్ప బాధితులకు అండగా నిలిచి ఆదుకునే ప్రయత్నం చేయడంలేదని విమర్శించారు. వరదల వల్ల10 రోజులకు పైగా పనులను కార్మికులు నష్టపోయారని, ఇప్పుడు ప్రభుత్వ నష్టపరిహారం కోసం పనులు మానుకుని తిరుగుతున్నారని అన్నారు. బ్యాంక్ లింక్, ఆధార ఈకెవైసి, మ్యాపింగ్ వంటి సాకులు చూపి బాధితులకు పరిహారం అందించలేదన్నారు. క్షేత్రస్థాయి లో మళ్లీ సర్వే జరిపి పరిహారం అందేలా చూడాలని కోరారు. ఆటోల రిపేర్లకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం ఏమాత్రం సరిపోవడం లేదని, అందువల్ల వారికి పరిహారం పెంచాలని కోరారు. అనంతరం సెంట్రల్ డిప్యూటీ తహసీల్దార్‌కు నేతలు వినతిపత్రం, బాధితుల అర్జీలు అందజేశారు. ఈకార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.కృష్ణ, నగర నాయకులు టి.చంద్రశేఖర్, కోరాడ రమణ, ఎన్.నాగేశ్వరరావు, వై.కష్ణ, కోటి రెడ్డి, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

కుమారుల మృతిపై కన్నీటి పర్యంతం

- కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే మృతిచెందారని తల్లిదండ్రుల ఆవేదన



ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం మాదల వారి గూడెం గ్రామంలోని లింగయాస్ కాలేజీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే తమ కుమారులు మరణించారని తల్లిదండ్రులు అంటున్నారు. ఎన్నో ఆశలతో తమ పిల్లలను కాలేజీలో జాయిన్ చేశామని, వారు బాగా చదువుకుని ఉన్నత ఉద్యోగం సాధించడం ద్వారా తమకు అండగా నిలుస్తారని ఆశిస్తే.. చివరకు కానరాని లోకాలకు వెళ్లిపోయి తమకు అన్యాయం చేశారని కన్నీటి పర్యంతం అయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఇద్దరు యువకుల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. మృతుల కుటుంబాలకు చెందినవారు ఆసుపత్రికి రావడంతో విషాదఛాయలు అలముకున్నాయి. తమ పిల్లల మృతదేహాలను చూసి బోరు విలపించారు. కాలేజీలో పిల్లలను జాగ్రత్తగా చూడాల్సిన యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యం వహించిందని, ఫలితంగానే వారు ఎక్కడో దూరంగా ఉన్నా క్వారీ గోతుల్లోకి వెళ్లి నీటిలో దిగి మరణించారని చెప్పారు. కాలేజీ యాజమాన్యం పిల్లలను బయటకు పంపకూడదని నిబంధన ఉన్న పట్టించు కోలేదన్నారు. లక్షల రూపాయలు ఫీజులు కట్టి పిల్లలను చేర్పిస్తే.. చివరకు వారి శవాలను తాము చూడాల్సి వచ్చిందని విలపించారు. తమ పిల్లల భవిష్యత్తును చిన్న వయసులోనే చిదిమేసిన కళాశాల యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కళాశాల యాజమాన్యం పోలీస్ స్టేషన్ కు చేరుకుంది. పోలీసులతో కొన్ని గంటల పాటు చర్చించారు. ఆ తర్వాత మతుల కుటుంబాలతో మాట్లాడారు. ఒక్కొక్కరికి ఐదు లక్షల చొప్పున పరిహారం కింద ఇచ్చేలా ఒప్పందం కుదిరినట్లు తెలిసింది. సిఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది. పోస్టుమార్టం తర్వాత మృతదేహాలను బంధువులకు అప్పగించారు.



ఓటరుగా దరఖాస్తు చేసుకుంటున్న జెసి గీతాంజలిశర్మ

6లోగా ఎంఎల్‌సి ఓటరుగా నమోదు చేసుకోవాలి : జెసి

ప్రజాశక్తి కలెక్టరేట్ (కృష్ణా) : జిల్లాలోని పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల ఓటరుగా పేర్లను వచ్చే నవంబరు 6వ తేదీ లోగా నమోదు చేసుకోవాలని సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ పిలుపునిచ్చారు. కృష్ణా గుంటూరు శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గానికి ఎన్నికల నేపథ్యంలో సోమవారం నగరంలోని కలెక్టరేట్లో ఓటర్లుగా పేరు నమోదు చేసుకొనుటకు మచిలీపట్నం ఆర్డిఓ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశారు. సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖర రావు ప్రత్యేక కేంద్రాన్ని సందర్శించి ఓటర్లుగా పేర్లు ఎలా నమోదు చేసుకోవాలని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు స్వయంగా ఫాం నెంబర్ 18 లో పూర్తి వివరాలు భర్తీ చేసి ఓటరుగా నమోదు చేసుకొనుటకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కెఆర్ఆర్‌సి ఎస్ డి సి శ్రీదేవి, మచిలీపట్నం ఆర్డిఓ కే స్వాతి, డ్వామాపిడి శివప్రసాద్, డిఎస్ఓ పార్వతి, పౌర సరఫరాల సంస్థ డిఎం సజన, జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి పాల్గొన్నారు.

'మీకోసం' ఫిర్యాదులపై అలసత్వంవద్దు : ఎస్‌పి



సమస్యలు వింటున్న ఎస్‌పి గంగాధరరావు

ప్రజాశక్తి కలెక్టరేట్ (కృష్ణా) : ప్రజల నుండి వచ్చే ఫిర్యాదుల విషయంలో అలసత్వం వహించకుండా సత్వర న్యాయం అందించేలా ప్రతి ఒక్క అధికారి కషి చేయాలని జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర్ రావు అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు తాము ఎదుర్కొంటున్న ఎలాంటి సమస్యనైనా పోలీస్ అధికారుల దష్టికి తీసుకు రావాలని ఆ సమస్యలపై చట్ట పరిధిలో విచారణ నిర్వహించి న్యాయం జరిగేలా కషి చేస్తామన్నారు. అలాగే కింద స్థాయి పోలీస్ అధికారులు ప్రజలు వారి సమస్యను తెలియజేసిన వెంటనే విచారణ నిర్వహించి వారికి న్యాయం జరిగేలా చూడాలని సూచించారు.సోమవారం జరిగిన మీ కోసం కార్యక్రమంలో జిల్లా లోని వివిధ ప్రాంతాల నుండి 35 ఫిర్యాదులు అందాయని కార్యాలయ అధికారులు తెలిపారు.

ఫోన్లో పందెంపై ఘర్షణ, వ్యక్తి మృతి



ఆశీర్వాదం (ఫైల్)

ప్రజాశక్తి-పెడన : ఫోన్లో ఆన్లైన్ ఆటలాడుతుండగా పందెం కట్టిన డబ్బులు చెల్లించే విషయంపై జరిగిన ఘర్షణలో ఒకరు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మడకలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మడక ఎస్సీ కాలనీకి చెందిన పి ఆశీర్వాదం (38) ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్‌డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి ఆశీర్వాదంతో పాటు జోగి ఆమోస్, అల్లాడ పండు, బొర్రా రమేష్ లతోపాటు మరో ఇద్దరు ఫోన్లో ఆటలు ఆడారు. వీరు డబ్బులు చెల్లింపులు విషయంలో ఘర్షణ పడ్డారు. తదనంతరం ఆశీర్వాదం ఇంటికి వెళ్లాడు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న సిఐ నాగేంద్రప్రసాద్ ఘటనా స్థలాన్ని చేరుకుని మతిని శరీరాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం బందరు ప్రభుత్వ ఆసుపత్రికి సోమవారం మధ్యాహ్నం తరలించారు. బంటుమిల్లి ఎస్ఐ గణేష్ కుమార్ తో పాటు పెడన ఏఎస్ఐ లక్ష్మణ్ రావు ప్రాథమిక విచారణ చేసి మృతిని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కృష్ణమూర్తి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సిపిఎం కార్యకర్త మృతి

ప్రజాశక్తి-మొవ్వ : మండల పరిధిలోని పెదపూడి గ్రామంలో సిపిఎం కార్యకర్త చిగురుపల్లి కృష్ణమూర్తి (70) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని సిపిఎం మొవ్వ మండల నాయకులు, సిఐటియు కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు ఒడుగు గంగాధరరావు, మొవ్వ మండల సిఐటియు కార్యదర్శి కాకి రాజశేఖర్, సిపిఎం కృష్ణాజిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణరావు, పామర్రు మండల సిపిఎం సీనియర్ నాయకులు ఎం.విల్సన్, ఎం నాగభూషణం, పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కొడాలి శ్రీనివాస్ సందర్శించి నివాళులర్పించారు. కృష్ణమూర్తి కుమారుడు చిగురిపల్లి సుబ్రహ్మణ్యం మొవ్వ మండలం సిఐటియు సహాయ కార్యదర్శి గా పనిచేస్తున్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉచిత కంటి పరీక్షలు


ప్రజాశక్తి-పమిడిముక్కల : పమిడిముక్కల మండలం లోని సంతాన సాయిబాబా ఆవరణలో జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 120 మందికి పరీక్షలు నిర్వహించారు. విజయవాడకు చెందిన మ్యాక్సీవిజన్ ఆసుపత్రి ద్వారా పరీక్షలు నిర్వహించినట్లు పమిడి ముక్కల మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు బండ్రపల్లి యోబు అన్నారు. మండల పరిధిలోని కపిలేశ్వరపురం, కృష్ణాపురం గ్రామాల నుండి కంటి వైద్య పరీక్షల కోసం ప్రజలు తరలివచ్చారు,ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు దుర్గారావు, బొల్లా వెంకటేశ్వరరావు, పాతూరు చంద్రపాల్, ద్రోణవల్లి కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి పాపారావుకు నివాళి



ప్రజాశక్తి-గన్నవరం : అమరవీరుల త్యాగాలు వృధా కావని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కళ్లం వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం తెలంగాణ సాయుధ పోరాటంలో అమరులైన అమరజీవి చింతపల్లి పాపారావు వర్ధంతి వామపక్షాల ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో ఉత్సాహంగా సాగింది. దావాజీగూడెం, అల్లా పురం, బుధవారం గ్రామాల్లో అమరవీరుల స్థూపాలపై జెండాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా కళ్లం వెంకటేశ్వరరావు, సిపిఐ నాయకులు పెద్దు వెంకటరత్నం మాట్లాడుతూ అమరవీరుల ఆశయ సాధన మనం కషి చేయాలని అన్నారు. కమ్యూనిస్టు పార్టీలు శ్రమజీవుల కోసం పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దు వాసుదేవరావు కాట్రగడ్డ జోషి, కొండా వీరా స్వామి. సుబ్బారావు, సిపిఎం నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, మిరప నాగేశ్వరరావు, సాంబశివరావు అవుటపల్లి సాంబయ్య, సర్దార్. మిరాఖాన్. షేక్ మాహబూబ్. బాబురావు పాల్గొన్నారు.

వైసిపి నాయకుడు బాలస్వామి మృతి



ప్రజాశక్తి-ఉంగుటూరు : వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు గుడిసె బాలస్వామి (63) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయనకు భార్య,ఇద్దరు కుమారులు ఉన్నారు. 2009 నుండి నీటి సంఘం అధ్యక్షుడిగాను 2014 నుండి 19 వరకు మండల టిడిపి అధ్యక్షుడిగా పని చేశారు. ఆయన మృతదేహాన్ని మాజీ శాసనసభ్యులు డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధన రావు, ముసునూరి రత్నబోస్, గన్నవరం ఎంపీపీ అనగాని రవి ,సిపిఎం జిల్లా కార్యదర్శి వారికి సభ్యుడు టీవీ లక్ష్మణ స్వామి ,వైసిపి కార్యకర్తలు వైసిపి మండల నాయకులు సందర్శించి నివాళు లర్పించారు.

తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ : ఎంఎల్‌ఎ



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ వెనిగండ్ల రాము

ప్రజాశక్తి - గుడివాడ : తాగునీటితో పాటు శానిటేషన్‌పై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే వెనిగండ్ల రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో శానిటేషన్ పెద్ద సమస్యగా మారిందన్నారు. గత ఐదేళ్లగా గుడివాడ పురపాల సంఘ అడ్మినిస్ట్రేషన్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయ్యిందన్నారు. అస్తవ్యస్తంగా ఉన్న గుడివాడను అభివద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరి కృషి అవసరమన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ పి శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, పబ్లిక్ హెల్త్ డి.ఈ పాండురంగారావు, శానిటేషన్, రెవెన్యూ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరణ : గుడివాడ నియోజకవర్గంలో ప్రజల తాగునీటి, రోడ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో ప్రజల నుండి సమస్యల అర్జీలను స్వీకరిం చారు. గుడివాడ నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు సమస్యలను ఎమ్మెల్యే దష్టికి తీసుకువచ్చారు. సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

23 నుంచి డాక్టర్స్ ప్రీమియర్ లీగ్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ప్రాణదాతలైన వైద్యులకు ఆటవిడుపుగా రూపుదిద్దుకున్న డాక్టర్స్ ప్రీమియర్ లీగ్ సీజన్-6కు రంగం సిద్ధమైంది. డాక్టర్స్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరగనున్న డీపీఎల్-6 ట్రోఫీ, ఆటగాళ్ల జెర్సీలను మాజీ మంత్రి, కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆవిష్కరించారు. పెనమలూరులోని పావని సోలిటైర్ లగ్జరీ హౌసింగ్ కమ్యూనిటీ హాల్లో సోమవారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్స్ ప్రీమియర్ లీగ్ సీజన్-6ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిరంతరం తలమునకలై ఉండే వైద్య నిపుణులకు డీపీఎల్ ద్వారా పునరుత్తేజం లభిస్తుందని అన్నారు. పలు హాస్పిటళ్లు, అనేక మంది వైద్యులతో సమన్వయం చేసుకుని ఈ తరహా భారీ క్రికెట్ క్రీడా సంరంభాన్ని నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. డీపీఎల్ సీజన్-6 టైటిల్ స్పాన్సర్ గా వ్యవహరిస్తున్న పావని కన్స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో రూపుదిద్దుకుంటున్న పావని సోలిటైర్ ప్రాజెక్టును డాక్టర్ కామినేని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. పావని కన్స్ట్రక్షన్స్ ఛైర్మన్ పాకలపాటి వీర రాఘవరావు మాట్లాడుతూ నగరంలో 12 ప్రముఖ హాస్పిటల్స్ ఫ్రాంచైజీలుగా ఉన్న ఈ మెగా ఈవెంట్‌లో 160 మంది వైద్య నిపుణులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ నెల 23వ తేదీ నుంచి డీపీఎల్-6 క్రికెట్ పోటీలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. దీపావళి నేపథ్యంలో 'ఫెస్టివల్ ఆఫ్ లైట్స్'.. ఫెస్టివల్ ఆఫ్ సిక్సెస్'గా డీపీఎల్ జరుగుతుందని తెలిపారు. విజయవాడ పరిసర ప్రాంతాల్లో మొట్టమొదటి సారిగా, పావని సోలిటైర్ లగ్జరీ హౌసింగ్ కమ్యూనిటీ అనేక ప్రత్యేకతలతో రూపుదిద్దుకుంటోందని వివరించారు. పూర్తి పర్యావరణ అనుకూలంగా, అత్యాధునిక సౌకర్యాలతో, అత్యద్భుతంగా సోలిటైర్‌ను తీర్చిదిద్దుతున్నామని అన్నారు. మొత్తం 1.5 ఎకరాల విస్తీర్ణంలో, బహుళ సౌకర్యాలతో 78 లగ్జరీ అపార్టుమెంట్లతో ఈ ప్రాంతానికే తలమానికంగా పావని సోలిటైర్ నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ స్పోర్ట్స్ అకాడమీ ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రశాంత్ కుమార్, ప్రస్తుత ప్రెసిడెంట్ డాక్టర్ కార్తీక్ తుమ్మల, పావని కన్స్ట్రక్షన్స్ డైరెక్టర్ డాక్టర్ సాయి శ్రీ హర్ష పాకలపాటి, డీపీఎల్-6లో పాల్గొంటున్న 12 ప్రాంచైజీల సభ్యులు పాల్గొన్నారు.


ట్రోఫీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్



కెబిఎన్‌లో స్కూటీ డ్రైవింగ్ ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-వన్‌టౌన్: కాకరపర్తి భావనారాయణ కళాశాల ఉమెన్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా ఈ నెల 25వ తేదీ నుంచి స్కూటీ డ్రైవింగ్ ఉచిత శిక్షణను ఇవ్వనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణకు రూపొందించిన పోస్టర్‌ను హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు సోమవారం ఆయన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ తమ కళాశాల ఉమెన్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో రెండు దశాబ్దాల కాలంగా మహిళలకు వివిధ చేతి వృత్తులకు సంబంధించి శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అదే క్రమంలో మహిళలకు స్కూటీ డ్రైవింగ్‌లో ఉచితంగా శిక్షణను అందిస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణా తరగతులకు సంబంధించి కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, ఉమెన్ స్టడీ సెంటర్ కన్వీనర్ వీ. శైలజ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై వర్షం నీరు

ప్రజాశక్తి-గంపలగూడెం: కట్టలేరు రహదారి మళ్లీ నీటితో మునుగుతోంది. గత రెండు రోజులుగా పడిన వర్షాలకు స్థానిక కట్టలేరు రహదారిపై వరద నీరు పారుతుంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పూర్ణయ్యకు కాంట్రిబ్యూషన్ అవార్డు

ప్రజాశక్తి-మైలవరం: స్థానిక లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ పూర్ణయ్య బిల్లాకి ఎక్సలెన్స్ ఇన్ రీసెర్చ్ కాంట్రిబ్యూషన్ అవార్డు అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రీసెర్చ్ విభాగంలో చేసిన కృషికి నీతి ఆయోగ్ కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సీస్ వారు ఈ అవార్డును ప్రధానం చేశారన్నారు. ఈ సందర్భంగా పూర్ణయ్యను కళాశాల ప్రెసిడెంట్ జి శ్రీనివాస్ రెడ్డి, వివిధ విభాగాధిపతులు అభినందించారు.



ఆకట్టుకున్న నాట్య ప్రదర్శనలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఎన్‌టిఆర్ జిల్లా కళాకారుల సమ్మేళనంలో భాగంగా మండలంలోని వేదాద్రి గ్రామంలోని యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానములో విజయవాడ మువ్వగోపాల కల్చరల్ ఆర్ట్ అకాడమి, తిరుపతి అన్నమయ్య కళాక్షేత్రం, దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వెలగపూడి లక్ష్మణదత్తు సహకారంతో కూచిపూడి, భరతనాట్య ప్రదర్శన వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నాట్య కళాకారులు నృత్య ప్రదర్శనలు చేశారు. జగ్గయ్యపేట సత్య కూచిపూడి నాట్యాలయం విద్యార్థి ఉజ్వల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. దేవస్థాన కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్‌బాబు కళాకారులను సత్కరించారు.



గుడి చుట్టూ డ్రైయిన్ నిర్మించరూ..!



ప్రజాశక్తి-వన్‌టౌన్: స్థానిక కొత్తపేటలోని శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవస్థానం చుట్టూ సైడ్ కాలువలు లేకపోవడంతో ఆ ప్రాంతంలో తీవ్ర దుర్గంధపూరిత వాతావరణం నెలకొంది. గతంలో ఉన్న కాలువను కార్పొరేషన్ సిబ్బంది పట్టించుకోక పోవడంతో ఆ కాలువలు మొత్తంగా పూడిక మట్టితో నిండిపోయి కాలువ ఆనమాలు లేకుండా పోయింది. దీంతో స్థానిక ప్రజలు దేవస్థానం చుట్టూతా ఉన్న ప్రహరీ వద్ద చెత్తాచెదారాలను పారవేస్తుండడంతో ఆ ప్రాంతంలో దుర్గంధపూరిత వాతావరణం నెలకొంది. కాగా ఇటీవల దేవస్థానానికు అనుబంధంగా నిర్మించిన ఎనిమిది షాపుల వద్ద కాలువ లేకపోవడంతో ఇబ్బందికరమైన వాతావరణం నెలకొంది . విజయవాడ నగరపాలక సంస్థ ఆ ప్రాంతంలో సైడ్ కాలువల నిర్మాణాలను చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. కాలువల నిర్మాణం జరిగితే ఆ ప్రాంతాల్లో చెత్తాచెదారం నిలువ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసే వీలుంటుంది. ఈ విషయమై శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానం కమిటీ అధ్యక్షులు వంజరపు సూర్యరావు మాట్లాడుతూ దేవస్థానం చుట్టూ విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సైడ్ కాలువల నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా దేవస్థానం చుట్టూ ప్రాంతం పరిశుభ్రంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు. అలాగే దేవస్థానానికు నిత్యం వచ్చే యాత్రికులు కూడా దేవస్థానం చుట్టూ సైడ్ కాలువ నిర్మాణం చేపట్టాలని నగరపాలక సంస్థ అధికారులకు విజ్ఞప్తి చేశారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-నందిగామ
పల్లె ప్రగతికి కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, జనసేన నందిగామ ఇన్‌చార్జ్ రమాదేవి అన్నారు. పల్లె పండుగలో భాగంగా మండలంలోని అడవిరావులపాడులో రూ.20 లక్షలు, లింగాలపాడులో రూ.25 లక్షలు, తక్కెళ్లపాడు గ్రామంలో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గంలోని 49వ డివిజన్ పరిధిలోని పెనుమాక దేవదాసు వీధిలో బిజెపి కార్పొరేటర్ బుల్లా విజయ్ స్థానిక మహిళలతో కలిసి సోమవారం సైడ్ డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎఇ ప్రసాద్, కూటమి నేతలు బడుగు వెంకన్న, కొమర కిరణ్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

దుర్గగుడి హుండీల ఆదాయం రూ.3.05 కోట్లు

ప్రజాశక్తి-వన్‌టౌన్: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం మహామండపం ఆరవ అంతస్తులో మూడవ దఫా సోమవారం హుండీలు లెక్కించగా నగదు రూ. 3,05,96,971, బంగారం 321 గ్రాములు, వెండి 9.882 కిలోలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కెఎస్ రామారావు తెలిపారు. విదేశీ కరెన్సీ ద్వారా యుఎస్‌ఎ 168 డాలర్లు, ఆస్ట్రేలియా 55 డాలర్లు, కువైట్ 41.5 దినార్లు, ఖతార్ 27 రియాల్స్, యుఏఇ 5 దిర్హమ్స్, మలేషియా 10 రింగెట్లు, సౌదీ 100 రియాల్స్ వచ్చినట్లు పేర్కొన్నారు.





బియ్యం, దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ దూలాస్ ట్రస్టు, నందిగామ చర్చి ఆఫ్ క్రీస్తు ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఇబ్రహీంపట్నం మండలం దాములూరు గ్రామంలో 60 మంది వరద బాధితులకు బియ్యం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దూలాస్ ట్రస్టు నిర్వాహకులు డా.పగిడిపల్లి దేవ సహాయము, పగిడిపల్లి జ్ఞానవరకుమార్, పంది శ్రీ ను, కూరగంటి మహేష్ పాల్గొన్నారు.

జయరాజుపై కేసు నమోదు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం
విలేకరిపై సోషల్ మీడియా వేదికగా దుర్భషలాడిన కాంట్రాక్టర్ జయరాజుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇబ్రహీంపట్నంలో అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న సచివాలయం భవనంలో కాంట్రాక్టర్ కుంచం జయరాజు చేస్తున్న అసాంఘిక కార్యకలాపాలపై వార్త రాసిన విలేకరిపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల వచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. జయరాజు సిఎం నివాసంపై జరిగిన దాడి కేసులో నిందితునిగా ఉండి కండిషనల్ బెయిల్‌పై బయటికి వచ్చారు.

పారిశుధ్య కార్మికురాలి కుటుంబాన్ని ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-వన్‌టౌన్: వైయస్సార్ కాలనీకి చెందిన కాంట్రాక్ట్ శానిటేషన్ కార్మికురాలు ఎస్.మరియమ్మ ఈ నెల 20వ తేదీ ఆదివారం రాత్రి గుండెపోటుతో అంబాపురంలో ఇంటి వద్ద మృతిచెందిందని, సంబంధిత కుటుంబానికి నగరపాలక సంస్థ ఆదుకోవాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. మరియమ్మ భౌతికదేహాన్ని సత్యబాబు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుడమేరు వరదలకు ఇబ్బందులు పడుతూ సెలవులు లేకుండా విధులు నిర్వహిస్తూ తీవ్ర పని ఒత్తిడికిలోనై గుండెపోటుతో మరియమ్మ మరణించిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం సెలవు దినం రోజు కూడా డ్యూటీ చేయడం జరిగిందని, కాంట్రాక్ట్ కార్మికులు తమ ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నా వారికి గ్రాట్యుటీ, ఇన్సూరెన్స్ పథకాలు అమలు చేయకుండా అనాథలుగా వదిలేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సర్కిల్ వన్ కార్యదర్శి వి.సాములు, కాలనీ నాయకులు దుర్గ, బుజ్జమ్మ, యోహాన్, గణేష్, అప్పారావు, మేరీ తదితరులు పాల్గొన్నారు.



సిఎం సహాయ నిధి అందజేత

ప్రజాశక్తి-జగ్గయ్యపేట
పట్టణంలోని కొలిమి బజార్‌కు చెందిన గాజుల సంతోష్ వర్మ కిడ్నీ ఆపరేషన్ కారణంగా హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.3.50 లక్షల ఎల్‌ఓసిని బాధిత కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య అందజేశారు.

'మీకోసం'లో అర్జీల వెల్లువ

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ప్రజల నుండి అందే అర్జీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖర రావు అధికారులకు సూచించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి శ్రీదేవి, ఆర్డిఓ కే స్వాతి లతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా డిఆర్ఓ జిల్లా అధికారులతో మాట్లాడుతూ తమ కార్యాలయానికి సంబంధించిన అర్జీ కానప్పుడు 24 గంటల్లోగా సంబంధిత శాఖకు పంపుతూ అర్జీదారునికి తెలపాలన్నారు. వివరాలు పంపని అధికారులకు షోకాజ్ నోటీసులు పంపుతామన్నారు. మొత్తం 150 అర్జీలను జిల్లా యంత్రాంగం స్వీకరించినట్లు కార్యాలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి శివప్రసాద్, డిఎస్ఓ పార్వతి, డి ఎం హెచ్ ఓ డాక్టర్ గీతాబాయి, పౌర రసరఫరాల సంస్థ డిఎం సజన, డి సి హెచ్ ఎస్ డాక్టర్ శ్రావణ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, జిల్లా పశుసంవర్ధక అధికారి చిన్న నరసింహులు పాల్గొన్నారు.

బుడమేరు గండ్లు పూడ్చాలని వినతి

బుడమేరుకు పడిన గండ్లు యుద్ధ ప్రాతపదికన పూడ్చాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలక్టరేట్ లో జరిగిన మీ కోసం కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరావుకు వినతి పత్రం అందజేశారు. గత నెల సెప్టెంబర్ నెలలో వచ్చిన వరదలతో బుడమేరు, వన్నేరు, పిల్లికోడు మొదలగు వాగుల ప్రవాహంతో ఉంగుటూరు మండలంలో అనేక గ్రామాలలో పంటలు మొత్తం నాశనం అయ్యాయని అన్నారు. బుడమేరుకు మూడు చోట్ల, వన్నేరుకు ఐదు చోట్ల గండ్లు పడి, పంట పొలాల్లోకి నీళ్లు వచ్చి పంటలు మొత్తం నష్టపోయి రెండు నెలలు గడుస్తున్నా ఇంతవరకు గండ్లు పూడ్చకపోవడంతో రైతులు భయ,ఆందోళనతో ఉన్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గండ్లు పూడ్చాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కౌలు రైతుల సంఘం కష్ణా జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, వ్యవసాయ కార్మిక సంఘం కష్ణా జిల్లా అధ్యక్షులు అజ్మీర వెంకటేశ్వరరావు, చెన్నా కోటేశ్వరరావు, పి విజయలక్ష్మి ఉన్నారు.



బుడమేరు గండ్లు పూడ్చాలని వినతిపత్రం అందిస్తున్న కౌలు, రైతు సంఘాల నాయకులు



సర్టిఫికెట్ అందుకుంటున్న అయానా అధినేతలు

'అయానా' కన్వెన్షన్‌కు 5 స్టార్ రేటింగ్

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడులోని ప్రముఖ కన్వెన్షన్ అయానకు 5స్టార్ రేటింగ్ సర్టిఫికెట్ ను ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అందజేశారు. ప్రఖ్యాత హెచ్ఎంవై ఇంటర్నేషనల్ సంస్థ, 'అయానా కన్వెన్షన్' సెంటర్ పాటిస్తున్న విధానాలు, ప్రణాళికలపై ఆమోదం తెలిపింది. దీంతో 5స్టార్ రేటింగ్ సర్టిఫికెట్, మెమెంటోను అయానా హొటల్ అండ్ కన్వెన్షన్ సెంటర్ అధినేతలు యార్లగడ్డ రాజశేఖర్, మనోజ్ లకు వెంకయ్యనాయుడు అందజేశారు. ఈ సందర్భంగా అయానా యాజమాన్యంను వెంకయ్యనాయుడు అభినందించారు.

ఎవల్ఎల్బి, ఎల్ఎల్బి పరీక్షా ఫలితాలు విడుదల

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల పరిధిలో లా కోర్సు ఎల్ ఎల్ బి -4 వ, బి.ఎ. ఎల్ ఎల్ బి-4, 8వ సెమిన్ ఫలితాలను విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి డా.పి. వీర బ్రహ్మాచారి తెలిపారు. లా కోర్సు ఎల్ ఎల్ బి - 4వ, బి.ఎ. ఎల్ ఎల్ బి - 4, 8 వ సెమిన్ పున: మూల్యాంకనం కొరకు దరఖాస్తు చేసుకొనేవారు అక్టోబర్ 29-2024 వరకు వెబ్సైట్ లో సూచించిన రుసుంను చెల్లించి దరఖాస్తు చేసుకొనవచ్చని తెలిపారు. పునః మూల్యాంకన వివరాలను వెబ్సైట్లో www.kru.ac.in పొందుపరచినట్లు డా.పి. వీర బ్రహ్మాచారి తెలియజేశారు.

పింగళి వెంకయ్య పేరు పెట్టడంపై ఎంపి హర్షం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : బందరు ప్రభుత్వ మెడికల్ కళాశాలకు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయ పతాక రూపశిల్పి, బందరు ప్రాంత వాసి పింగళి వెంకయ్య పేరు పెట్టడం పట్ల ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మచిలీపట్టణం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి కతజ్ఞతలు తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి చందద్రబాబు బందరు విచ్చేసినప్పుడు ఈ విషయం పరిశీలించాలని సభాముఖంగా కోరగా సుముఖత వ్యక్తపరిచారని, తదనుగుణంగా సోమవారం జీవో నెంబర్ 132 ను విడుదల చేశారన్నారు.

రాష్టస్థాయి పోటీలకు జడ్‌పి బాలికలు ఎంపిక

ప్రజాశక్తి-గన్నవరం : తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు చదువుతో పాటు క్రీడలలో ప్రతిభ చూపిస్తున్నారని జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చూపి, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో పాల్గొంటున్నారని గన్నవరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయిని దుగ్గిరాల ఝాన్సీ రాణి తెలిపారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తమ పాఠశాలో చదివే మానికొండ సాయి సత్య చిన్మయ్ అండర్-14 లో ఫెన్సింగ్ (కత్తి సాము) హిప్పి విభాగంలో జిల్లా స్థాయిలో తన సత్తా చూపి రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 23వ తేది నుంచి నంద్యాల లో జరిగే రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలో పాల్గొంటుదన్నారు. అలాగే మరొక బాలిక జి. లోచన అండర్ 17 విభాగంలో హ్యాండ్ బాల్,సైక్లింగ్ లో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయమ ఉపాధ్యాయిలు కె. గీత, జి. కష్ణ ప్రియ లను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయిలో కూడా తమ సత్తా చాటి జాతీయ స్థాయిలో గెలుపొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బాలికలతో ప్రధానోపాధ్యాయుని ఝాన్సీ రాణి

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు 'శ్రీ మల్లికార్జున' విద్యార్థి

ప్రజాశక్తి-గన్నవరం : చదువుతో పాటు క్రీడల్లో కూడా తమ పాఠశాల విద్యార్థులు రాణిస్తున్నారని శ్రీ మల్లిఖార్జున పాఠశాల ప్రధానోపాధ్యాయిని డి. మాధవీ లత అన్నారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 15 వ తేది నున్న జడ్.పి. హైస్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి ఫెన్సింగ్ (కత్తి సాము) అండర్ -14 సాబర్ విభాగంలో తమ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న మానికొండ సాయి ప్రశాంత్ తన సత్తా చాటి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. శిక్షణ ఇచ్చిన పాఠశాల వ్యాయమ ఉపాధ్యా యులు టి. వంశీకృష్ణను ఈ సందర్భంగా అభినం దించారు. రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలు నంద్యాల లో ఈ నెల 23 నుంచి 25 తేది వరకు జరుతుతాయని, రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా ప్రతిభ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



డిఎస్‌సి ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు ఉచిత డి.ఎస్.సి శిక్షణ పొందుటకు గాను అభ్యర్థులు ఆన్లైన్ ద్వారా http://jnanabhumi.ap.gov.in జ్ఞాన భూమి వెబ్ సైట్‌లో దరఖాస్తు నమోదు చేసుకొనుటకు గాను ఈ నెల 25. తేది వరకు గడువు తేదీని పొడిగించినట్లు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా ఉప సంచాలకులు షాహిద్ బాబు షేక్ తెలిపారు. కావున జిల్లాలో డిఎస్‌సి శిక్షణను తీసుకొనుటకు అర్హత కలిగిన ఎస్.సి, ఎస్.టి అభ్యర్థులందరు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశమును సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మరింత సమాచారం కోరకు http: //jnanabhu mi.ap.gov.in ను చూడాలన్నారు.

టాలీ కోర్సుపై ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా)/విజయవాడఅర్బన్ : రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో కానూరులోని ఫెడరల్ స్కిల్ అకాడమీ ట్రైనింగ్ సెంటర్లో టాలీ కోర్సుపై సర్టిఫికెట్తో కూడిన ఉచిత శిక్షణతో పాటు ఖచ్చితమైన ఉద్యోగావకాశాలకు సంబంధించి అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి డి. విక్టర్ బాబు తెలిపారు. ఈ శిక్షణలకు బి.కామ్, బీఎ, బీబీఎ, ఎమ్.కామ్ పూర్తి చేసిన 18 నుండి 30 సంవత్సరాల అభ్యర్థులు అర్హులు అని తెలియజేసారు. ఈ నెల 28న శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. శిక్షణ అనంతరం ప్రముఖ ప్రైవేటు రంగ సంస్థలలో ఉద్యోగావకాశాలు కల్పిస్తారని తెలిపారు. ఉమ్మడి కష్ణా జిల్లాలో గల ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా కానూరు తులసినగర్లోని ఫెడరల్ స్కిల్ అకాడమీ ట్రైనింగ్ సెంటర్లో వివరాలు నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు లి8714692748, 8714692749లి నెంబర్లను సంప్రదించాలని తెలియజేసారు.



ఉపాధి అవకాశాలపై శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : కృష్ణా విశ్వ విద్యాలయంలోని ఇంజ నీరింగ్ కళాశాలలో అక్టోబర్ 21 సోమవారం నుండి అక్టోబర్ 26వ తేదీ వరకు ఉద్యోగ,ఉపాధి అవకాశాల శిక్షణా తరగతులు జరగనున్నాయని ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. విజయకుమారి తెలియజేశారు. వచ్చే నెల నుండి టిసిఎస్ వంటి బహుళ జాతి సంస్థల నుండి ఉద్యోగ నోటిఫికేషన్లు రానున్నాయన్న సమాచారంతో విద్యార్థులకు వారం రోజుల పాటు జావా, పైతాన్ వంటి వాటిలో కోడింగ్ తరగతులను వర్సిటీ తరపునుండి విద్యార్థులకు ఎటువంటి ఖర్చు లేకుండా వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఆర్. శ్రీనివాసరావు ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. టాలెంట్ షైన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ఇంజనీరింగ్‌లోని ఈసీఈ, సిఎస్ఈ విద్యార్థులతో పాటు ఎంసీఏ, ఎంటెక్ విద్యార్థులకు కూడా ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు అవసరమైన పైతాన్, జావా వంటి కోడింగ్ నైపుణ్యాలను నేడున్న పోటీ పరీక్షలకి సరిపోయేవిధంగా శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. సోమవారం ప్రారంభమైన తరగతులలో భాగంగా ఆ సంస్థ సీఈవో వేణు మొదటి సెషన్ ప్రారంభించి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాల శిక్షణ ప్రాముఖ్యతను, మెళకువలను వివరించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇంజనీరింగ్ కళాశాల డీన్ ఆచార్య వైకే సుందర కృష్ణ మాట్లాడుతూ ఈ పోటీ ప్రపంచంలో టెక్నికల్ విద్యార్థులకు శిక్షణ తరగతుల ఆవశ్యకతను వివరించారు.



వాహనాలు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ యార్లగడ్డ వెంకట్రావు

చెత్త తరలింపు వాహనాలు ప్రారంభం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లోని చెత్త డంపింగ్ సమస్యపై ప్రజల చిరకాల స్వప్నం నెరవేరిందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. సోమవారం స్వచ్ఛ గన్నవరం కార్యక్రమంలో భాగంగా చెత్త ఎత్తివేత రవాణా వాహనంను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసరపల్లి, బుద్ధవరం గన్నవరం పంచాయతీల నిధులు సుమారు రూ. 52 లక్షల వ్యయంతో చెత్త డంపింగ్ వ్యాన్‌ను కొనుగోలు చేసి స్వచ్ఛ గన్నవరం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. గన్నవరం ప్రజలు చాలా కాలంగా చెత్త డంపింగ్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారని, ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చెప్పేందుకు వాహనం అందుబాటులోకి తెచ్చామన్నారు. డిపిఓ అరుణ, డి ఎల్ పి ఓ సంపత్ కుమారి, గ్రామపంచాయతీ సర్పంచ్ నిడమర్తి సౌజన్య, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, బుద్ధవరం సర్పంచ్ బడుగు బాలమ్మ, కేసరపల్లి సర్పంచ్ లక్ష్మీ మౌనిక, గన్నవరం ఉపసర్పంచ్ పాలడుగు నాని, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఎంపీటీసీ సభ్యులు మద్దినేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సిసి రోడ్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి-పెడన : మండల పరిధిలోని పలు గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మించేందుకు జడ్పిటిసి సభ్యుడు ఆర్జా నగేష్ సోమవారం శంకుస్థాపనలు చేశారు. స్థానిక రూరల్ ప్రాంతం లోని కాకర్లమూడి, మడక, బల్లిపర్రు, లంకల కలవగుంట గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో సిసి రోడ్లు నిర్మించేందుకు భూమి పూజ చేశారు. టిడిపి మండల అధ్యక్షుడు చలపాటి ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి సీరం ప్రసాద్ పాల్గొన్నారు.

అమరావతి బాలోత్సవం గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: అమరావతి బాలోత్సవం ఏడో పిల్లలు పండగ గోడపత్రికను కొండపల్లి డాక్టర్ మోహన్‌రావు మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి బాలోత్సవ కమిటీ సభ్యులు పట్ల కామేశ్వరరావు అధ్యక్షతన వహించగా డాక్టర్ మామిడి శీతారామారావు, అమరావతి బాలోత్సవ కార్యదర్శి వెనిగళ్ల మురళీమోహన్ మాట్లాడుతూ ఈ సంవత్సరం జరిగే బాలోత్సవంలో 42 అకాడమీ, 18 సాంస్కృతిక విభాగాల్లో 60 రకాల పోటీలు జరుగుతాయన్నారు. నవంబర్ 15, 16, 17 తేదీల్లో విజయవాడ సిద్ధార్థ కాలేజీ ఆడిటోరియంలో జరిగే పోటీలకు సంబంధించి నవంబర్ పదో తేదీలోపు దరఖాస్తులు అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 6305954249 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో టాలెంట్ పై స్కూల్ అధినేత ఎస్వీఎస్ఎస్ ప్రసాద్, నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్ హెచ్‌ఎం ఎస్‌కె సర్దార్ సాహెబ్ పాల్గొన్నారు.





వరద బాధితులకు మరో అవకాశమివ్వండి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి కొత్త గేటు శ్రామిక నగర్, అంబేద్కర్ నగర్, జగన్ అన్న కాలనీ వాసులకు వరద బాధితులకు ప్రభుత్వం సాయం అందించాలని, తిరస్కరించిన అర్జీలు మరలా పెట్టుకోవడానికి వరద బాధితులకు మరోసారి అవకాశం కల్పించాలని కోరుతూ విజయవాడ సబ్ కలెక్టర్ చైతన్యని సిపిఎం ఆధ్వర్యంలో బాధితులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం సిపిఎం కార్యదర్శి ఎం.మహేష్, వరద బాధితులు పాల్గొన్నారు.

రఘునందన్‌కు అరుదైన గౌరవం

ప్రజాశక్తి-తిరువూరు: ఈ నెల 20వ తేదీన తాడేపల్లిగూడెంలో



జరిగిన ప్రపంచ సాహిత్య, సాంస్కృతిక చరిత్ర కలిగిన వరల్డ్ రికార్డ్ 24 గంటల నిర్విరామ కవి సమ్మేళనంలో తిరువూరు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి రేపాక రఘునందన్ అరుదైన రికార్డుని సాధించారు. శ్రీశ్రీ కళా వేదిక నిర్వహించిన కవి సమ్మేళనంలో రఘునందన్ పాల్గొని రైతు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి చదివిన కవిత ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా రఘునందన్ పేరును అమేజింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ మార్వెల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, టిఎన్ఎ (తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ), కల్చరల్ టాలెంట్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు చేస్తున్నట్లుగా ప్రకటించారు. ఈ సందర్భంగా కళా వేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్, జాతీయ ప్రధాన కార్యదర్శి టి.పార్థసారథి తదితరులు రఘునందన్‌ను ఘనంగా సన్మానించి జ్ఞాపికను, ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

రోడ్డుప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి-తిరువూరు: రోడ్డుప్రమాదంలో ఒకరు మృతిచెందిన ఘటన మల్లెల గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. సీఐ గిరిబాబు తెలిపిన వివరాల ప్రకారం విస్సన్నపేట మండలం తెల్లదేవరపల్లి గ్రామానికి చెందిన ఇసుక కృష్ణ (32) తన భార్యతో కలిసి బైక్‌పై తిరువూరులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బంధువును పరామర్శించడానికి వెళ్లారు. తిరిగి భార్యను ఆటోలో ఎక్కించి బైక్‌పై ఒక్కడే ఇంటికి వెళుతుండగా మల్లెల గ్రామంలో వెనుక వైపు నుండి వేగంగా వచ్చిన మహారాష్ట్రకు చెందిన కంటైనర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని తిరువూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వెల్లడించారు.

యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-వత్సవాయి: తామర పురుగు నివారణకు మొక్కజొన్న, జొన్న పంటలు ఉత్తమమని ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె అచ్యుతరాజు, శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ రాజశేఖర్ అన్నారు. మండలంలోని గోపినేనిపాలెం గ్రామంలో డాక్టర్ కేఎల్ రావు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మిరపలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులుకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిరపలో ప్రధానంగా పంట నష్టాన్ని కలగజేసే పురుగులు తెగుళ్ల వాటి నివారణ చర్యల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఐ వెంకట్ రెడ్డి, డాక్టర్ టి జస్వంత్ రెడ్డి, విఎఎ రాకేష్ పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక



ప్రజాశక్తి-తిరువూరు: రాష్ట్రస్థాయిలో జరగనున్న జూనియర్ ఖోఖో జట్టుకు తిరువూరు మండలంలోని మల్లెల నన్నక నరేంద్ర ధనలక్ష్మి మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఉమ్మడి కృష్ణా జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన గుడివాడ ఎస్పీఎస్ మున్సిపల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో జట్టు ఎంపిక జరిగింది. దీనిలో పాల్గొన్న తమ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు గొట్టం ఉమ, గుంజి వెంకటేశ్వరావు, పల్లపు జస్వంత్ ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు వేముల శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం మండల విద్యాశాఖ అధికారి ఎ.శ్యామ్‌సుందర్ విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపా ధ్యాయుడు ఎస్.కృష్ణప్రసాద్‌ను అభినందించారు.

సదుపాయాలు కల్పించాలని విద్యార్థులు ధర్నా



ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్లలోని ప్రభుత్వ జూనియర్ కలాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సౌమవారం కళాశాల వద్ద విద్యార్థులు ధర్నా న్విహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గోపినాయక్ మాట్లాడుతూ కంచికచర్లలో ఎన్టీఆర్ జూనియర్ కాలేజీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాడు నేడు పనులను పూర్తి చేయాలని, సంక్షేమ హాస్టళ్లల్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం తహాశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మాధవ్, గోపి, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో అధిక ధరలకు అమ్మితే చర్యలు



ప్రజాశక్తి-మైలవరం: రైతు బజార్లలో కూరగాయలను ధరల పట్టిక కంటే ఎక్కువగా అమ్మితే చర్యలు తప్పవని మార్కెటింగ్ డిప్యూటీ డైరెక్టర్ పి లావణ్య అన్నారు. ఇటీవల మైలవరం రైతు బజార్లో బోర్డు ధరల కంటే అధిక ధరలకు కూరగాయలను విక్రయిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో మైలవరంలోని రైతు బజార్‌ను సోమవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అధిక ధరలకు అమ్ముతున్నారని ఫిర్యాదు వచ్చినట్లయితే ఆ షాపు వారిని తొలగిస్తామన్నారు. టమాట, ఉల్లిపాయలు ధరలు ఇటీవల ఎక్కువగా ఉండటంతో నేరుగా మార్కెటింగ్ అధికారులు కర్నూల్ లో కొనుగోలు చేసిరైతు బజార్ల ద్వారా టమాట, ఉల్లి పాయలను అమిస్తున్నామన్నారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎం మంగమ్మ, మైలవరం రైతు బజార్ ఎస్టేట్ ఇన్చార్జి అధికారి చిట్టిబాబు పాల్గొన్నారు.

మద్యం షాపు తొలగించాలని వినతి

ప్రజాశక్తి-కంచికచర్ల: విజయవాడ రహదారిలో జనావాసాలు, విద్యా సంస్థలకు కూత వేటు దూరంలో ఏర్పాటు చేసిన సాయి దుర్గా వైన్స్ షాపును తొలగించాలని మహిళలు, విద్యా సంస్థల సిబ్బంది సోమవారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయం, ఎక్సైజ్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ, సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి.గోపినాయక్ మాట్లాడుతూ పాఠశాల, కళాశాలకు వెళ్లే విద్యార్థులు వందల సంఖ్యలో ఈ కూడలి మీదుగా వెళ్లి వస్తుంటారని, ఇటువంటి చోట మద్యం షాపులు ఏర్పాటు చేయడం మంచిది కాదన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే ప్రదేశంలో మద్యం షాపును తక్షణం తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం నందిగామ



ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, తహాశీల్దార్ జాహ్నవి, ఎక్సైంజ్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కుర్రా పద్మ , కె.వి కృష్ణ, రమేష్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు : జయప్రద

ప్రజాశక్తి-కంచికచర్ల: ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రైతుల పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని పౌర సరఫరాల అసిస్టెంట్ మేనేజర్ జయప్రద సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కంచికచర్ల, వీరులపాడు మండలాల పరిధిలోని వివిఎలకు ధాన్యం కొనుగోలులో తీసుకోవాల్సిన మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం సేకరణకు రైతులకు అవసరమైన గోనె సంచులు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. కూలీలు, రవాణా ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల, వీరులపాడు తహాశీల్దార్లు జాహ్నవి, హుస్సేన్, డీటీ సుమతి, అగ్రికల్చర్ ఏవో విజయకుమార్ పాల్గొన్నారు.



ఎంఎల్ఎ సౌమ్యకు సన్మానం

ప్రజాశక్తి-కంచికచర్ల: విశ్రాంతి ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో సోమవారం విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కోగంటి బాబు, గుర్రం రామకృష్ణ, స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ మేనేజర్ గోపికృష్ణ, ఎస్‌టిఓ ఎం కష్ణారావు, ఎంఈఓ బాలాజీ, రిటైర్డ్ ఉద్యోగ నేతలు సానే రామ్మోహన్రావు, ముండ్లపాటి పోతురాజు, తాడపనేని లక్ష్మణరావు పాల్గొన్నారు.

గ్రామసభలో మూడు అర్జీలు

ప్రజాశక్తి-గంపలగూడెం: మండలంలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నారు. భూముల రీసర్వే అనంతరం ఏమైనా సమస్యలు తలెత్తితే వాటిని పరిష్కరించుకోవడం కోసం ప్రభుత్వం మరో అవకాశాన్ని కల్పించింది. అందులో భాగంగా సోమవారం రాజవరంలో జరిగిన గ్రామసభకు మూడు అర్జీలు వచ్చినట్లు తాసిల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బద్రీనాథ్, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

అర్హులకు ఉపాధి పనులు కల్పిస్తాం : ఎపిఒ



ప్రజాశక్తి-పమిడిముక్కల : ఉపాధి హామీ ద్వారా కాలువ తవ్వకాలు, చెరువు పూడిక, పొలం కెళ్ళే డొంక రోడ్లను జాతీయ ఉపాధి హామీ పథకంలో గుర్తించి పనులు చేపడతామని ఏపీవో కె. లక్ష్మారెడ్డి అన్నారు. పమిడ ి ముక్కల మండలంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో ఆయన సోమవారం మాట్లాడుతూ గ్రామాలలో గ్రామసభల ద్వారా ఉపాధి పనులకు అర్హులను గుర్తించి వారికి పని కల్పిస్తామని తెలిపారు. పమిడిముక్కల, వేల్పూరు గ్రామాలు మినహా అన్ని గ్రామాలలో ఉపాధి పనుల ద్వారా సిసి రోడ్ల నిర్మాణం జరుగుతు న్నాయన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-చల్లపల్లి : త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు నమోదు చేసుకోవాలని తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు మోర్ల శివపట్టభద్రులకు సూచించారు. చల్లపల్లి మండలం లోని యార్లగడ్డ, పురిటిగడ్డ, పాగోలు మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు ఉపాధ్యాయులకు ఫారం 18 సోమవారం అందజేశారు. నవంబర్ 6 తో నమోదు గడువు ముగి యనుండటంతో త్వరితగతిన నమోదు చేసుకోవాలని కోరారు. 22 వ తేదీన ఏటీఎం సెంటర్ లో ఎమ్మెల్సీ ఓటరు నమోదు శిబిరం నిర్వహించ నున్నట్లు తెలిపారు. పట్టభద్రులు ఈ శిబిరంలోఓటు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు. ఎంపీటీసీలు పైడిపాముల స్వప్న, రాజులపాటి అంకమ్మ మాజీ ఎంపీటీసీ దేవభక్తుని గోపాలకృష్ణ , పురిటిగడ్డ గ్రామ టిడిపి అధ్యక్షుడు కైతేపల్లి నాగ శీను బాబు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి-చల్లపల్లి : స్థానిక నారా యణరావునగర్ కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణం గా సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో వికలాంగుడు సోమన వెంకన్నకు చెందిన తాటాకు పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. ప్రమాదంలో బాధితుడు సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో నిలిచాడు. స్థానికులు మంటలు అదుపు చేశారు. సమాచారం అందుకున్న అవనిగడ్డ అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలు అదుపుచేసి నష్టం వివరాలు నమోదు చేసుకున్నారు. ప్రమాదంలో బాధితులకు రూ.లక్ష మేరకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

వంశీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మాజీ ఎంఎల్ఎ వల్లభనేని వంశీమోహన్ పుట్టినరోజు వేడుకలు నిర్వ హించడం ఆనందంగా ఉందని జెడ్పిటిసి ఎలిజిబెత్ రాణి అన్నారు. సోమవారం గన్నవరం జడ్పిటీసీ కార్యాల యంలో ఘనంగా మహిళలు ప్రజా ప్రతినిధులుతో పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. వైఎస్ఆర్ పార్టీ మహిళా జిల్లా కార్యదర్శి సూరెడ్డి మణిమ్మామైనార్టీ సంక్షేమ సంఘం జిల్లాఅధ్యక్షుడు పులిమద్ది చిన్న మస్తాన్, వైఎస్ఆర్ పార్టీ నాయకులు నందిపాటి సుబ్బారెడ్డి, వి. పద్మ, డా.ఎ. సుమనస్వి పాల్గొన్నారు.

కౌన్సిలర్లతో ఎంఎల్ఎ భేటీ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపల్ కౌన్సిలర్లతో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సమావేశమయ్యారు. 15 రోజుల్లో కొండపల్లి మున్సిపాలిటీ బోర్డు ఏర్పడే అవకాశం ఉన్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. చైర్మన్ ఎవరు అనే అంశంపై నారా లోకేష్‌దే తుది నిర్ణయం అని తెలియజేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కొండపల్లి మున్సిపాలిటీ, ఇబ్రహీం పట్నంలలో జరగనున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు.

అబ్దుల్ కలాం జీవితం స్ఫూర్తిదాయకం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఉమారాణి

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఇప్పటివరకు ఐక్యరాజ్య సమితి ద్వారా మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కు మాత్రమే గుర్తింపు దక్కిందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి ప్రశంసించారు. కళాశాల ఫిజిక్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ విద్యార్థి వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం విద్యా రంగానికి చేసిన సేవలు విద్యార్థులను వివరిస్తూ ఆయన జన్మదినాన్ని ప్రపంచ విద్యార్థి దినోత్సవంగా యుఎన్ఓ ప్రకటించిందని తెలిపారు. ప్రపంచ స్థాయిలో ఒక భారతీయ శాస్త్రవేత్త ఇంత గుర్తింపు తెచ్చుకొని ప్రతి భారతీయుడు గర్వపడేలా చేసిన కలాం ఒకరోజు విద్యార్థి దినోత్సవం చేసే సరిపోదని ఇంతటి గొప్ప వ్యక్తి గురించి ప్రతి విద్యార్థి వీలైనంత ఎక్కువ తెలుసుకోవాలన్నారు. ఆయన జీవితం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బయట నో సేల్... లోపల సేల్

- అధికారుల ఆదేశాలు పాటించని మద్యం వ్యాపారులు



ప్రజాశక్తి-చల్లపల్లి : నివాసాల మధ్య మద్యం అమ్మకాలు నిలుపు చేయమని ఆ ప్రాంతవాసులు అధికారుల కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసినా మద్యం దుకా ణంలో మద్యం అమ్మకాలు చేస్తుండడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నివాసాల మధ్య మద్యం దుకాణాలు నిలిపివేయమని అధికారులు ఆదేశాలు జారీ చేసినా నిబంధనలకు విరుద్ధంగా నిర్లక్ష్యంగా మద్యం అమ్ముతున్న దుకాణాదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. స్థానిక మూడో వార్డులోని పవన్ వైన్స్‌లో బయట నో సేల్ బోర్డు పెట్టి అమ్మకాలు చేపడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగాఉండే విద్యార్థిని విద్యార్థులు ఉద్యోగులు రాకపోకలు కొనసాగిస్తారు వైన్ షాప్ సమీపంలో అంగన్వాడి బాలికల వసతి గృహం, నేత్ర పరీక్ష కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండటంవల్ల మందుబాబుల ఆగడాలు వల్ల ఇబ్బంది పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పవన్ వైన్ షాప్ తొలగించాలని చేయాలని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, తాసిల్దార్, సిఐ మొవ్వ ఎక్సైజ్ సిఐ కు వినతిపత్రం సమర్పించినట్లు ప్రాంతవాసులు తెలిపారు కావున అధికారుల ఆదేశాలను ఉల్లంఘించి అమ్మకాలు చేస్తున్న మద్యం దుకాణంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు

విద్యార్థినులకు చేయూత

ప్రజాశక్తి-కంకిపాడు : రాష్ట్రస్థాయి లో జరిగే ఆటలు పోటీల్లో పాల్గొనే కంకిపాడు మండలం ప్రొద్దుటూరు హైస్కూల్ విద్యార్థినిలకు నవయువ సేవాసంస్థ చేయూత నిచ్చింది. సంస్థ అధ్యక్షుడు యార్లగడ్డ బుల్లియ్య, ప్రతినిధి ఉయ్యూరు శివరావు, అరుణకుమారి చేతులు మీదుగా 5వేలు నగదును అందజేశారు.



సాయం అందిస్తున్న దృశ్యం

ఎనిమిదో రోజుకు సమ్మె

ప్రజాశక్తి-పెనమలూరు : జీతాలు చెల్లించాలని తాడిగడపమున్సిపాలిటీ పరిధిలో తడి పొడి చెత్త వ్యాన్ డ్రైవర్ల కార్మికులు చేస్తున్న సమ్మె సోమవారంతో 8వ రోజుకు చేరింది. కార్మికులు అర్ధనగ్నంగా లాకుల సెంటర్లో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పెనమలూరు మండలం సిఐటియు కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు మాట్లాడుతూ జీతాలు చెల్లించాలని కార్మికుల చేస్తున్న సమ్మె 8వ రోజుకు చేరినా అధికారులు పట్టించుకోక పోవడం తగదన్నారు. కార్మికులకు మూడు నెలలు జీతాలు రావాల్సిన విషయంలో అధికారులు ఎలాంటి ప్రయత్నాలు చేశారో ఇప్పటికీ చెప్పకపోవడం విడ్డూరమన్నారు. స్థానిక ఎంఎల్ఎ బోడే ప్రసాద్, మంత్రి నారాయణకు సమస్య వివరించినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సమస్య పరిష్కారమైనంత వరకు ఐక్య మత్యంతో పోరాడాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు మండలం సిఐటియు నాయకులు మస్తాన్ వలి,. వ్యాన్ డ్రైవర్ల సంఘం నాయకులు సురేష్, నాగరాజు, సోనీ, చిన్న, భోజనాయక్, రాంబాబు, సుధాకర్, రాజు, శేఖర్, నవీన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





వరద బాధితులకు చిన్నారుల సహాయం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నంలోని స్థానిక శివగంగ స్వాతి స్కూల్ విద్యార్థులు విజయవాడ బుడమేరు వరద బాధితుల సహాయం నిమిత్తం స్వాతి స్కూల్లో విద్యార్థులు సేకరించిన 13వేల రూపాయల ను చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్ ఆంధ్ర ప్రదేశ్ అనే పేరుతో చెక్ ద్వారా మంత్రి కొల్లు రవీంద్ర కి సోమవారం విద్యార్థులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల్ని మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.ఎస్. ప్రవీణ్ నరేంద్ర విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని తీర్మానం

ప్రజాశక్తి-మొవ్వ: మొవ్వ మండలం చినముత్తేవి సిపిఎం శాఖ మహాసభ పెదముత్తేవి శ్యామ్ సన్ అధ్యక్షతన సోమవారం జరిగింది. చినముత్తేవి గ్రామ సిపిఎం శాఖ కార్య దర్శిగా మాదాసు నాగులుని ఎన్నుకున్నారు. ఈ మహాసభలో గ్రామంలో ఉన్న ప్రజా సమస్యలు పరిష్కరించాలని తీర్మానించారు. గ్రామంలో అంతర్గత రోడ్లు నిర్మించాలని, అయినంపూడి డ్రైన్ పైన ఉన్న వంతెనను పటిష్ట చేసి ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని, దళితపేటలలో మరియు గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్లు లేని అందరికీ మరుగుదొడ్లు నిర్మించి ఇవ్వాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు శీలం నారాయణరావు, కమిటీ సభ్యులు దేవరపల్లి మని పాల్గొన్నారు.

రేపు వేలం పాటలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో వేంచేసియున్న శ్రీ లంకమ్మ అమ్మవారి ఆలయంలో ఈనెల 23వ తేదీ ఉదయం 11 గంటలకు కొబ్బరికాయలు, పూజా సామాగ్రి సంవత్సర కాలం పాటు విక్రయించుకునేందుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో యార్లగడ్డ వాసు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 23 నుండి వచ్చే ఏడాది అక్టోబర్ 22 వరకు ఒక సంవత్సర కాలం పాటు కొబ్బరికాయలు పూజ సామాగ్రి అమ్ముకునే లైసెన్స్ పొందేందుకు ఈ వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ వే లం లో పాల్గొనేవారు రూ 25 వేల రూపాయల ధరవత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని చెప్పారు. అదేవిధంగా ఈ నెల 24వ తేదీన ఉదయం 11 గంటలకు భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరలు ఘటం బిందెలు విక్రయం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పాఠశాలకు సామాగ్రి అందజేత

ప్రజాశక్తి-మొవ్వ : మొవ్వ గ్రామంలోగల మండవ కనకయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ కు 1.3 లక్షలతో ఆర్ఓ ప్లాంట్ ను మధుకర్ (యూఎస్ఏ) ఓల్డ్ స్టూడెంట్స్ 1.2 లక్షల విలువైన స్టీమ్డ్ రైస్ కుక్కర్, 40 వేల రూపాయల విలువైన మధ్యాహ్న భోజనం వడ్డించు నిమిత్తం సర్వీస్ కౌంటర్లు మండవ శేషగిరిరావు (యూఎస్ఏ) సహకారంతో ఏర్పాటు చేసిన సామాగ్రి, వస్తువులను పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తాతినేని గోపాల్ రావు, మండవ బుజ్జి, (కోటేశ్వరరావు) మండవ నీలవేణి, తాతినేని పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ వితరణ

ప్రజాశక్తి-విస్సన్నపేట: విస్సన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కనకపూడి రామారావు (చికాగో అమెరికా) తల్లి కనకపూడి నాగరత్నం జ్ఞాపకార్థం కంప్యూటర్ బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సాంకేతిక విజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని కాలానికి అనుగుణంగా మార్పు చెందుతున్న టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావును అభినందించారు.

ఇంకా సాయం అందలేదు...

సిపిఎం నేతల ఎదుట వరద బాధితుల గగ్గోలు

రేపు అజిత్ సింగ్‌నగర్ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా



వరద బాధితులతో కలిసి నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-విజయవాడ

మాకు ఇంకా సాయం అందలేదు... సమాధానం చెప్పే నాథుడు కరువయ్యారు... అంటూ సిపిఎం నేతల ఎదుట వరద బాధితులు గగ్గోలు పెట్టారు. అజిత్ సింగ్‌నగర్, పాయకాపురం, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో సిపిఎం నాయకులు సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా వరద బాధితులను కలుసుకుని మాట్లాడారు. చాలా మందికి పైసా సహాయం అందలేదు... కొందరికి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉండగా పైఅంతస్తులో ఉన్నట్లు రూ.10 వేలు మాత్రమే ఇచ్చారు... కొన్ని కుటుంబాలలో వాహనాలకు మూడు వేల రూపాయలు జమ అయినా... ఇంటికి రూ.25 వేలు ఇవ్వలేదు... తోపుడు బండ్లు, చిరు వ్యాపారులకు అత్యధిక మందికి చిల్లి గవ్వ ఇవ్వలేదు... ట్రేడ్ లైసెన్స్ ఉండాలని నిబంధనలు పెడుతున్నారు... కొన్ని ఆటోలకు సహాయం అందక, రిపేర్లు చేయించుకోలేక 50 రోజులుగా ఆటోలు ఇళ్ల వద్దే ఉంచుతున్నాం... అప్పులు చేసి కార్లు కొని, సొంతంగా కిరాయికి తిప్పుకుంటుండగా వరదలో మునిగిన వాటికి ప్యాకేజీ ప్రకటించలేదు... అర్హుల జాబితాలో కొందరి పేర్లు కనపడుతున్నాయి కానీ ఏ బ్యాంకులోను డబ్బులు జమ కాలేదు... సచివాలయాలు, తహశీల్దార్ , కలెక్టర్, ఎమ్మెల్యే కార్యాలయాల చుట్టూ అనేక రోజుల నుండి తిరుగుతున్నా సమాధానం చెప్పే నాథుడు కరువయ్యారు అంటూ బాధితులు సిపిఎం నాయకులకు తమ ఆవేదనను వెల్లిబుచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ వరద హెచ్చరికలు చేయటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల బాధితులు నిండా మునిగిపోయారన్నారు. ప్రతి ఒక్క బాధితుడికి సహాయం చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించి 50 రోజులు గడిచినా ఇంకా వేలాది మందికి సహాయం అందలేదన్నారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు చేసిన ఎన్యూమరేషన్ తప్పులతడకగా ఉందన్నారు.. ఎన్నికల సందర్భంగా ఓట్లకు అర్హులైన వారు, వరద సందర్భంలో సహాయానికి అనర్హులుగా ప్రకటించడం గర్హనీయమన్నారు. బాధితుల సమస్యలను పరిష్కరించాల్సిన శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. నేతలు మద్యం, ఇసుక సిండికేట్లలో బిజీగా ఉన్నారన్నారు. బాధితుల గోడు పట్టించుకునే తీరిక వారికి లేదన్నారు. వరద బాధితులకు అందరికీ సహాయం అందించే విషయంపై ముఖ్యమంత్రి ప్రత్యక్ష జోక్యం చేసుకోవాలన్నారు. వరద బాధితుల అందరికీ తక్షణమే సాయం అందించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23వ తేదీన అజిత్‌సింగ్‌నగర్ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు బి.రమణరావు, సిహెచ్.శ్రీనివాస్, నిజాముద్దీన్, అరుణ, విజయ, శివ పార్వతి తదితరులు పాల్గొన్నారు.



కంచికచర్లలో పోలీసుల ర్యాలీ

ప్రజాశక్తి-కంచికచర్ల: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా కంచికచర్లలో సోమవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి మెయిన్ రోడ్ మీదుగా బస్టాండ్ సెంటర్‌కు వరకు ఎస్ఐ బి.రాజు ఆధ్వర్యంలో సిబ్బంది, మహిళా పోలీసులు ర్యాలీలో పాల్గొన్నారు. ముందుగా అమరులైన పోలీసులకు నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ మంగ్య నాయక్, సిబ్బంది ప్రభాకర్, రాధాకృష్ణ, అనీష్, వీరబాబు, ఉపేంద్ర, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై డెటాల్ అవగాహన

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: అంతర్జాతీయ హ్యాండ్ వాషింగ్ దినోత్సవం సందర్భంగా డెట్టాల్ సంస్థ పాఠశాల విద్యార్థులకు చేతలు పరిశుభ్రతపై వివిధ అవగాహనా కార్యక్రమాలు విజయవాడతో పాటు వివిధ ప్రాంతాలలో నిర్వహిస్తున్నట్లు సంస్థ ఇన్‌ఛార్జి కె.ధనుంజయరావు తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం చేతులు కడుక్కోవడం అవసరమని తెలిపారు. 30 మిలియన్ల పిల్లలకు డెట్టాల్ బనేగా స్వాస్థ్ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతపై వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. క్లీన్ హ్యాండ్స్ ఫర్ ఆల్, అడ్వాన్సింగ హెల్త్ క్యాప్సన్‌తో వివిధ పాఠశాలల్లో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. పిల్లలకు ప్రధానమైన పరిశుభ్రత గురించి అవగాహన ఉండాలని దీనిపై ప్రతి ఒక్కరూ తెలియజేయాలన్నారు.

రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్‌లో కీర్తన ప్రతిభ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఈనెల 17 నుండి 19వ తేదీ వరకు గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల జిమ్నాస్టిక్స్ పోటీలలో నగరంలోని శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్ధ మహిళా జూనియర్ కళాశాల విదత్యార్థిని ఎస్.కీర్తన అద్భుత ప్రతిభ కనపరచి పతకాలు సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ తెలిపారు. లబ్బీపేటలోని కళాశాల కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రతిభ కనపరచిన విద్యార్థిని కీర్తనను సోమవారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ పద్మజ మాట్లాడుతూ జిమ్నాస్టిక్స్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో ఫ్లోర్ ఎక్సరసైజ్‌లో బంగారు పతకం, బీమ్‌లో రజత పతకం, యునేరీన్ బార్‌లో రజత పతకం సాధించినట్లు తెలిపారు. అలాగే ఆల్‌రౌండర్ ఇండివిడుయల్ గేమ్స్‌లో బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది కీర్తనను అభినందించారు.



వీధి విక్రయదారులను ఆదుకోండి

ప్రజాశకి-వన్‌టౌన్: బుడమేరు వరదల కారణంగా నష్టపోయిన వీధి విక్రయదారులకు ఆర్థిక సహాయం చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్రకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు మాట్లాడుతూ వరదకు చిరు వ్యాపారులు తమ తోపుడు బండ్లు, వ్యాపారాలు కోల్పోయారని వారిని ఆర్థికంగా ఆదుకోవాలని, పారిశుధ్య కార్మికులకు ఒక నెల జీతం బోనస్‌గా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్ష, కార్యదర్శులు కే.ఆర్.ఆంజనేయులు, మూలి సాంబశివరావు, వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెడ్డు వెంకటేశ్వరరావు, నాయకులు సిహెచ్ఎల్వీపీ మారుతీరావు తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ ఆటో కార్మికుల ధర్నా



ప్రజాశక్తి-విజయవాడ: క్లాప్ ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నగర కమిటీ ఆధ్వర్యంలో సింగ్‌నగర్‌లోని ఎక్సెల్ ప్లాంట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు కార్యదర్శి టి.ప్రవీణ్ మాట్లాడుతూ క్లాప్ ఆటో కార్మికులు దాదాపుగా మూడు నెలల నుండి జీతాలు లేక వరదలకు అతలాకుతలమై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. స్వయంభు యాజమాన్యం కనీసం వరదల్లో ఉన్న కార్మికులను ఆదుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం, స్వయంభు యాజమాన్యం వెంటనే కార్మికులకు పెండింగ్లో ఉన్న మూడు నెలల జీతాలు వెంటనే ఇవ్వాలని, పిఎఫ్ ఈఎస్ఐ బకాయిలు కూడా సంవత్సరం నుండి పెండింగ్లో ఉన్న వాటిని కట్టించాలని, ఆదివారం ఫుల్ డే సెలవు, కనీసం నెలకి నాలుగు సెలవులు ఇవ్వాలని, జీవో నెంబర్ 7 ప్రకారం రూ.24 వేలు జీతం పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో క్లాప్ ఆటో నాయకులు శివ, రామరాజు, రుద్ర, మురళి తదితరులు పాల్గొన్నారు.

టయోటా గ్లాంజా కారుపై ఆఫర్లు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: రానున్న పండుగల సందర్భంగా టయోటా క్లిర్లోస్కర్ మోటార్స్ సంస్థ గ్లాంజా ఫెస్టివల్‌ను ప్రారంభించినట్లు సంస్థ ఇన్‌ఛార్జి కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. నగరంలోని కిర్లోస్కర్ మోటార్స్ నందు సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలియచేశారు. పెస్టివల్స్ సందర్భంగా ఫిట్టెడ్ టయోటా జెన్యూస్ యాక్సెసరీస్‌ను అందిస్తున్నారని వాటిని వినియోగించుకోవచ్చని తెలిపారు. నూతనగ్లాంజా కారు అత్యాధునిక సాంకేతికతతో పాటు సొగసైన డిజైన్, అధిక ఇంధన సామర్థ్యంతో ఉంటుందన్నారు గ్లాంజా వివరాలను తెలుసుకునేందుకు నగరంలోని కిర్లోస్కర్ మోటార్స్ డీలర్‌షిప్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ




ప్రజాశక్తి-విజయవాడఅర్బన్

మాచవరం యారం వారి వీధిలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కమ్యూనిటీహాల్లో అమరావతి బాలోత్సవ కమిటీ, విశ్వమాన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పూలే-అంబేద్కర్ ట్యూషన్ పాయింట్‌లో చదువుతున్న తమిరి మల్లికార్జున అండ్ చంద్రమతి మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు సోమవారం పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కె.జ్వలిత, ఎస్ సురేష్, ట్యూషన్ నిర్వాహకులు జి.నటరాజు, టీచర్ గుడిమెట్ల గురు ప్రసాద్ పాల్గొన్నారు.

డాక్టర్ నాగరాజుకు ఆంధ్రరత్న అవార్డు

ప్రజాశక్తి:జి.కొండూరు: జి.కొండూరుకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు, కవి డాక్టర్ పెదగమళ్ల నాగరాజు ఆంధ్ర రత్న అవార్డును అందుకున్నారు. సోమవారం విజయవాడలో అఖిల భారత సాంస్కృతిక సంస్థ, ఆంధ్రప్రదేశ్ కల్చరల్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు సాహిత్య సేవ ఉత్తమ విద్య బోధనలో ఈ అవార్డును ఆయన స్వీకరించారు. అఖిల భారత సాంస్కృతిక సేవా సంస్థ చైర్మన్ డాక్టర్ విజయకుమార్, మెజిస్ట్రేట్ శంకర్, ప్రముఖ కన్నడ తెలుగు సినీనటి పంకజం, కౌన్సిలర్ సునీత, ప్రముఖ నాట్య కళాకారిణి వాణి అవార్డును నాగరాజుకు అందించారు. గతంలో కూడా నాగరాజు పలు అవార్డులను అందుకున్నారు. ఆంధ్ర రత్న అవార్డును అందుకున్న నాగరాజును జి.కొండూరు మండల ప్రజలు, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అభినందించారు.



బిర్లా పెయింట్స్ వినూత్న ప్రచారం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఆదిత్య బిర్లా గ్రూప్‌కు చెందిన బిర్లా ఓపస్ పెయింట్స్ ఇపుడు సరికొత్త ప్రచారానికి శ్రీకారం చుట్టినట్లు సంస్థ ప్రతినిధి ఎం. ఫణికుమార్ తెలిపారు. నగరంలోని బిర్లా పెయింట్స్ సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. నయే జమానేకా నయా పెయింట్ నినాదంతో వినూత్నంగా ప్రచారాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కొత్త యుగానికి కొత్త పెయింట్ అనే క్యాప్షన్‌ను వినూత్నంగా ఆకట్టుకుంటుందని తెలిపారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో ప్రతి ఒక్కరూ ఇంటిని ఇంటి పరిసరాలను అందంగా ఉంచుకునేందుకు వివిధ రకాలైన పెయింట్స్ వాడుతున్నారని వారి అభిరుచులకు అనుగుణంగా బిర్లా ఓపస్ పెయింట్స్ నూతన ఉత్పత్తులు, నూతన ప్రచారానికి నాంది పలికిందని తెలిపారు.